క్లుప్తంగా

వైభవంగా శేష వాహన సేవ



శేష వాహనంపై భీమేశ్వరస్వామి

సంగం: మండలంలోని వంగల్లులో జరుగుతున్న కామాక్షీదేవి సమేత భీమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి శేష వాహనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కామాక్షీదేవి, భీమేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి శేష వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ వితరణ



కావలి రూరల్: పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్‌కు చెందిన దివ్యాంగుడు మొగిలి నరసింహానికి హ్యాపీ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వీల్‌చైర్‌ను అందజేశారు. పుట్టుకతోనే దివ్యాంగుడైన నరసింహానికి దాతల సహకారంతో వీల్‌చైర్‌ను అందించినట్లు హ్యాపీ సేవా సంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా తెలిపారు. సంస్థ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, మొగల్ సిరాజ్‌బేగ్, దేవరకొండ విజయ్, చేవూరి ప్రభయ్య, శివనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ



వరికుంటపాడు: యర్రంరెడ్డిపల్లిలో కోదండరామ స్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా శంఖును ప్రతిష్ఠించి భూమిపూజ నిర్వహించారు. ఆలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దుకూరి రమేష్‌నాయుడు, వెంకటమహాలక్ష్మి దంపతులు రూ.10 లక్షలు విరాళం ప్రకటించారు. కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్, ఎస్ మాలకొండయ్య, ఏ వెంకటసుబ్బయ్య, ఆర్ మాలకొండరావు, ఎన్ రంగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చంద్రమౌళీనగర్ సమీపంలోని పట్టాలపై బుధవారం పట్టపగలు చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. కసుపర్తిపాడులో శ్రీనివాసులు (48) తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నారు. భవన నిర్మాణాల వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నెల్లూరు వైపు వెళ్లే పట్టాలపై తిరుపతి – పూరి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ క్రమంలో శ్రీనివాసులు బంధువులు అతని కోసం గాలింపు చర్యలు చేపట్టి రైల్వే పోలీసులను సంప్రదించారు. ఫోన్లోని ఫొటో ఆధారంగా మృతుడు శ్రీనివాసులేనని నిర్ధారించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కిసాన్‌నగర్, రాజీవ్‌గాంధీకాలనీలో నిర్వహిస్తున్న పేకాట కేంద్రంపై ఎస్‌ఈబీ అధికారులు మంగళవారం రాత్రి దాడి చేశారు. 15 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం నవాబుపేట పోలీసులకు అప్పగించారు. నవాబుపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు వివరాలను బుధవారం వెల్లడించారు. హరనాథపురానికి చెందిన జాఫర్‌ఖాన్ కిసాన్‌నగర్ రాజీవ్‌గాంధీకాలనీలో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని కొంతకాలంగా పేకాట కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. దీనిపై జిల్లా ఎస్‌ఈబీ అధికారి శ్రీలక్ష్మికి సమాచారం అందింది. ఆమె ఆదేశాల మేరకు డీఎస్‌ఈఓ, నెల్లూరు – 1 ఇన్‌స్పెక్టర్లు హుస్సేన్, కిశోర్ తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. నిర్వాహకుడు జాఫర్‌ఖాన్‌తో పాటు జూదరులైన ఎఫ్‌సీఐ కాలనీలోని శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరపురం ఇస్లాంపేటలోని హుస్సేన్, జాకీర్‌హుస్సేన్‌నగర్ నేతానగర్‌లోని బాబూరావు, రమేష్‌బాబు, నవాబుపేటలోని గాండ్లవీధికి చెందిన శ్రీనివాసులు, మర్రిపాడు మండలంలోని హజరత్, కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలోని మహేష్, పొటూరులోని బాబు, పడుగుపాడులోని హరిబాబు, కొడవలూరు మండలం తలమంచిలోని వెంకటసుధీర్, మాగుంట లేఅవుట్ లెక్చరర్స్ కాలనీలోని శ్రీనివాసులు, సత్యనారాయణపురంలోని దుర్గారావు, సరస్వతీనగర్‌లోని దశరథరామిరెడ్డి, ఇందుకూరుపేట మండలం మైపాడులోని హరిని అదుపులోకి తీసుకున్నారు. రూ.78,850 నగదు, 11 సెల్‌ఫోన్లు, ఏడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

పారిశుధ్యంలో ఆదర్శంగా గండ్లవీడు

ఆ గ్రామంలోని అంతర్గత రోడ్లు ఇరుకుగా ఉంటాయి. ఇళ్లలోని మురుగు రోడ్లపై నిల్వ ఉండి దుర్గంధం..దోమల సమస్యతో కొన్ని దశాబ్దాలుగా గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చదువుకున్న యువత నడుంబిగించారు. ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రత్యేకంగా అండర్ డ్రైనేజీల నిర్మాణం చేపట్టి పారిశుధ్యంలో గ్రామాన్ని ఆదర్శంగా నిలిపారు.



గండ్లవీడు రామాలయం ఎదురు వీధిలో డ్రైనేజీపై నిర్మించిన వాకింగ్ ట్రాక్(ఇన్‌సెట్లో) మరో వీధిలో ఇళ్ల ముందు చేపట్టిన అండర్ డ్రైనేజీ నిర్మాణం

ఆత్మకూరురూరల్: మండలంలోని గండ్లవీడు గ్రామం పారిశుధ్యంలో ఆదర్శంగా నిలుస్తోంది. ఓ వైపున బొగ్గేరు, మూడు వైపులా పంట పొలాలు కలిగిన ఈ గ్రామంలో సుమారు 300 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామంలోని అంతర్గత రోడ్లు ఇరుకుగా ఉంటాయి. ఇళ్లలోని మురుగు బయటకు వెళ్లే వీల్లేక అంతర్గత రోడ్లపై నిలిచి దుర్గంధం..దోమలతో కొన్ని దశాబ్దాలుగా గ్రామస్తులు ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన చదువుకున్న యువకులు పారిశుధ్య సమస్య పరిష్కారానికి నడుంబిగించారు. డ్రైనేజీ నిర్మాణం చేపట్టి వాటిపైన వాకింగ్ ట్రాక్ నిర్మించాలని తలపెట్టారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి దృష్టికి తమ ఆలోచనలను తీసుకెళ్లారు. ఆయన సావధానంగా విని డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నిధుల మంజూరుకు సమ్మతించారు. ఆయన అకాల మరణంతో గ్రామస్తుల ప్రతిపాదనలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఈ నేపథ్యంలో ఆత్మకూరు ఉపఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన మేకపాటి విక్రమ్‌రెడ్డి దృష్టికి మరోమారు యువత పారిశుధ్య సమస్య, తమ ప్రయత్నాలు, గౌతమ్‌రెడ్డి ఇచ్చిన హామీని తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించడంతో ప్రస్తుతానికి ప్రధానంగా సమస్య ఎదుర్కొంటున్న వీధుల్లో 410 మీటర్ల మేర అండర్ డ్రైనేజీ నిర్మాణంతో పాటు వాకింగ్ ట్రాక్‌ను పూర్తి చేశారు. డ్రైనేజీల్లో ప్రతి 15 మీటర్లకు ఒక చోట చెత్తను తొలగించేందుకు వీలుగా మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. తద్వారా పారిశుధ్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. పట్టణాలు, నగరాలకే పరిమితమైన డ్రైనేజీలపై వాకింగ్‌ట్రాక్‌లను చిన్నపల్లెటూరిలో నిర్మించి ప్రత్యేకతను చాటుకున్న గండ్లవీడు యువత ప్రతిభను పరిసర గ్రామాల ప్రజలు సైతం ప్రశంసిస్తున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు సచివాలయం నిధులు రూ.10 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలు, ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిధులు రూ.5 లక్షలు వెచ్చించడం ద్వారా 60 శాతం మేర పారిశుధ్య సమస్యను పరిష్కారమైంది. మరో విడత నిధులు మంజూరు చేయించి తమ గ్రామంలో సంపూర్ణ పారిశుధ్యం సాధిస్తామని యువకులు పేర్కొంటున్నారు.

సత్ఫలితాలను ఇస్తున్న యువకుల ఆలోచన



గండ్లవేడులో పారిశుధ్య సమస్యను పరిష్కరించేందుకు విద్యావంతులైన యువకులు చేస్తున్న ప్రయత్నం సత్ఫలితాలను ఇస్తోంది. గ్రామంలో 30 మందికిపైగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా పనిచేస్తున్నారు. వారితో సంప్రదించి భవిష్యత్‌లో పారిశుధ్య కార్యక్రమాలతో పాటు గ్రామానికి అవసరమైన వసతులు సమకూర్చుకునేందుకు సమష్టిగా పని చేస్తున్నాం.

– కొల్లి దొరస్వామినాయుడు, గండ్లవీడు

ఎమ్మెల్యే సహకారంతో మరింత అభివృద్ధి



పడకండ్ల పంచాయతీ పరిధిలో గండ్లవీడు, పడకండ్ల, యర్రబల్లి, బొటికర్లపాడు గ్రామాలు ఉన్నాయి. గండ్లవీడులో పారిశుధ్య సమస్య పరిష్కారానికి యువత చొరవతో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రత్యేకంగా మంజూరు చేయించిన నిధులతో పక్కగ్రామాల వారికి ఆదర్శంగా నిలిచేలా డ్రైనేజీలు, వాటిపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టాం. ఎమ్మెల్యే సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం.

– మాముడూరు నరసింహులు, సర్పంచ్, పడకండ్ల

ఉగాది నాటికి గృహ ప్రవేశాలు

• కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు



ఇళ్ల నిర్మాణ పనుల గురించి ఆరాతీస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

ఆత్మకూరు: రానున్న ఉగాదికి జిల్లాలో 16 వేల గృహ ప్రవేశాలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు తెలిపారు. మున్సిపల్ పరిధిలోని పమిడిపాడు, నెల్లూరుపాళెంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని బుధవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇసుక ఉచితంగా ఇవ్వడం, ఐఎస్‌ఐ క్వాలిటీ గల ఇనుము, సిమెంట్ సకాలంలో సరఫరా చేస్తుండడంతో నిర్మాణ పనుల్లో వేగం పెరిగిందన్నారు. ఇప్పటికే ఆరువేల ఇళ్లు పూర్తయ్యాయని, మరో నాలుగువేల ఇళ్లు రూఫ్ స్థాయి దాటి మిగిలిన పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో ఒకేరోజు 35 ఇళ్లకు శ్లాబులు వేసేలా పర్యవేక్షిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి, కమిషనర్ ఎం.రమేష్‌బాబు, హౌసింగ్ డీఈ నటరాజ్‌ను అభినందించారు. జిల్లాలో లబ్ధిదారులకు ఇబ్బందుల్లేకుండా వారానికి రూ.8 కోట్ల మేర బిల్లులను విడుదల చేస్తున్నామన్నారు. పూర్తయిన ఇళ్ల వద్ద తాగునీటి వసతి, రహదారి సౌకర్యం తదితర వసతులు వేగవంతంగా కల్పించేలా ఆదేశాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనరసింహం, సచివాలయాలు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



జలదంకిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కావలి ఆర్డీఓ శీనానాయక్

జలదంకి: మార్చి 13న జరిగే తూర్పు రాయలసీమ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి కావలి ఆర్డీఓ శీనానాయక్ జలదంకిలోని పోలింగ్ కేంద్రాలను బుధవారం పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ జలదంకిలో పట్టభద్రుల కోసం ఒక పోలింగ్ కేంద్రం, ఉపాధ్యాయుల కోసం ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశామని తెలిపారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ భరత్, పాఠశాల హెచ్‌ఎం కొండారెడ్డి ఉన్నారు.

ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి



ఉదయగిరి: మాట్లాడుతున్న ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్



ఆత్మకూరురూరల్: మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మార్చితో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఉపాధి పనుల లక్ష్యాలను పూర్తి చేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. అర్హులందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేయాలని, ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి అవకాశాలు చూపాలని సూచించారు. దినసరి కూలి రూ.250కు తగ్గకుండా చూడాలన్నారు. ఏపీఓ శిరీషారెడ్డి, సాంకేతిక సహాయకుడు వినోద్, రవీంద్ర, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు కూలి అందేలా చూడాలి

ఉదయగిరి: ఉపాధి కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన గిట్టుబాటు కూలి రూ.257 అందేలా క్షేత్రసహాయకులు చూడాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవిలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. రోజుకు నాలుగు వేల మంది పనికి హాజరయ్యేలా చూడాలన్నారు. మార్చి చివరి నాటికి రెండు వేల కుటుంబాలు వంద రోజుల పనిదినాలు పూర్తి చేసేలా చూడాలన్నారు. ఇన్‌చార్జి ఏపీఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

చేజర్ల: గ్రామాల్లో ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని ఏపీఓ వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం 26 పంచాయితీల్లో పనులు జరుగుతున్నాయన్నారు. రోజుకు 2500 మందితో పనులు చేయించాల్సి ఉండగా, 1200 మంది మాత్రమే హాజరవుతున్నారని తెలిపారు. వేసవిలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ఎంపీడీఓ విజయలలిత, ఈసీ ఉమాదేవి, హౌసింగ్ ఏఈ, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జాబ్‌కార్డులకు ఆధార్ సీడింగ్

సోమశిల: ఉపాధి కూలీల జాబ్ కార్డులకు ఆధార్ సీడింగ్ చేపట్టాలని ఏపీడీ శంకర్‌నారాయణ క్షేత్రసహాయకులను ఆదేశించారు. అనంతసాగరం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన క్షేత్రసహాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టాలని సూచించారు. ప్రతి కూలీకి కూలి రూ.250కు తగ్గకుండా చూడాలన్నారు. మండలంలో ప్రస్తుతం 1500 మందికిపైగా హాజరవుతున్నారని, 2500 మందికి తగ్గకుండా హాజరయ్యేలా చూడాలని సూచించారు. ఉపాధి కూలీల మస్టర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఓ దయాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

రేపు సర్వసభ్య సమావేశం

వింజమూరు: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నలక్ష్మి బుధవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మండలాధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

రేపు వాహనాల వేలం

ఉదయగిరి: ఉదయగిరి సెబ్ కార్యాలయంలో ఈ నెల 24న ఉదయం 10.30 గంటలకు వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సెబ్ ఎస్సై మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయగిరి సెబ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన నాలుగు వాహనాలను వేలం వేయనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు ప్రభుత్వం నిర్దేశించిన 10శాతం ధరావత్తు నగదును ముందుగా చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.


అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

వరికుంటపాడు: రామదేవులపాడు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏపీ వినియోగదారుల హక్కుల పరిరక్షణ ఫోరం రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు చల్లగాలి వెంకటమోహన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మూడేళ్లగా అంగన్‌వాడీ కార్యకర్త లేకపోవడంతో తమ చిన్నారులను కేంద్రానికి పంపలేకపోతున్నామని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆయన వెంట ఫోరం మండల ఉపాధ్యక్షుడు పీ మహేష్, కార్యనిర్వాహక సభ్యుడు ఎస్ మధు ఉన్నారు.

గిరిజన కుటుంబానికి చేయూత

అనుమసముద్రంపేట: రాజవోలుకు చెందిన గిరిజన కుటుంబం జీవనోపాధికి స్థానిక ఈఎంసీ చర్చి నిర్వాహకులు చేయూతనందించారు. నిరుపేద గిరిజనుడైన యాకోబు కుటుంబానికి జీవనోపాధి కల్పించేందుకు నాలుగు మేకలను చర్చి పాస్టర్ సుధీర్‌బాబు బుధవారం అందజేశారు. ఆయన వెంట చర్చి నిర్వాహకులు ఉన్నారు.

అబుల్ కలాం ఆజాద్‌కు ఘన నివాళి



అనుమసముద్రంపేట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ హమీద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు.

ఆశీర్వాదం

ఆత్మకూరురూరల్: గండ్లవీడులో ఇటీవల వివాహమైన కొల్లి దొరస్వామి నాయుడు, సుస్మిత దంపతులను ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బుధవారం ఆశీర్వదించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, కొల్లి అఖిల్‌నాయుడు, దాడి శ్రీనివాసులునాయుడు ఉన్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే బీసీలకు పెద్దపీట



సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే రామిరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కావలి రూరల్: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటనలో బీసీలకు పెద్దపీట వేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాలను సమానంగా చూస్తూ రాష్ట్రాభివృద్ధికి దోహదపడుతున్న ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. జగనన్న ప్రజా సంకల్పపాదయాత్రలో బీసీ గర్జన సభలో చెప్పిన విధంగానే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీలకు అన్నింటిలోనూ ప్రాధాన్యం కల్పిస్తున్నారన్నారు. బీసీల్లోని అన్ని వర్గాల సంక్షేమానికి ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేసి సమన్యాయం చేస్తున్నారన్నారు. సీఎం వైస్ జగన్ బాటలోనే ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్నీ కులాలను సమన్వయం చేసుకుంటూ అందరికీ సముచిత స్థానాలు కల్పిస్తూ వచ్చారని ధన్యవాదాలు తెలిపారు.ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, కుందుర్తి కామయ్య, నాయుడు రాంప్రసాద్, కుందుర్తి శ్రీనివాసులు, షాహుల్, అనురాధ, కొమరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గ్రిగ్ క్రీడా పోటీలు ప్రారంభం



సత్తాచాటిన క్రీడాకారులతో పీడీ మల్లికార్జునరావు

సంగం: ఆత్మకూరు నియోజకవర్గ స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీలు కొరిమెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కొరిమెర్ల సర్పంచ్ మీరమ్మ, ఎంఈఓ జానకీరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్‌రెడ్డి, కరిముల్లా ముఖ్యఅతిథులుగా హాజరై జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. మూడ్రోజుల పాటు పోటీలు జరుగుతాయని ఎంఈఓ తెలిపారు.

గ్రిగ్ పోటీల్లో చేజర్ల విద్యార్థుల సత్తా

చేజర్ల: ఆత్మకూరు నియోజకవర్గస్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. సంగం మండలం కొరిమెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగిన క్రీడా పోటీల్లో 400 మీటర్ల పరుగులో తోడేటి వెంకటరమణ ప్రథమ స్థానంలో నిలిచాడు. లాంగ్‌జంప్, ట్రిపుల్‌జంప్‌లో ఎల్లంటి ప్రభాస్ తృతీయస్థానంలో నిలచాడు. టెన్నీకాయిట్‌లో జూనియర్ బాలికల విభాగంలో అల్లం శ్రీసంజన, మాతంగి పెంచలలక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచారు. సీనియర్ బాలికల విభాగంలో చల్లా చిత్ర, సంకే సింధు, గొరిపర్తి సుహాసిని ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను హెచ్‌ఎం హైమావతి, పీడీ మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా గంధ మహోత్సవం



దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: అనంతసాగరంలోని హజరత్ సయ్యదినా యూసుఫ్ ఆలీషా ఖాదరి దర్గాలో గంధ మహోత్సవ వేడుకలను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గంధోత్సవంలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి సయ్యద్ మునీర్‌ఆలీషాఖాదరి ఆశీర్వచనాలు అందజేశారు. తొలుత ఎమ్మెల్యేకు జెడ్పీటీసీ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు బట్రెడ్డి జనార్దన్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. అనంతసాగరం చెరువు మత్స్యకార సొసైటీ చైర్మన్ షేక్ మౌలా, సర్పంచ్ బొర్రా శోభ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు: మండలంలోని భీమవరానికి చెందిన దగ్గుపాటి పెంచల సాయిదీక్షిత్ అనే బాలుడు అనారోగ్యంతో చెన్నైలోని రెయిన్‌బో వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. బాలుడికి వైద్యం చేయించేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో తండ్రి దగ్గుపాటి పెంచల ప్రసాద్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని కలిసి సీఎం సహాయ నిధి ద్వారా సాయం అందించాలని మొరపెట్టుకున్నారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సీఎం కార్యాలయ అధికారులను సంప్రదించి సీఎం సహాయ నిధి నుంచి తక్షణ సాయంగా రూ.1.50 లక్షలు మంజూరు చేయించారు. బుధవారం నెల్లూరులోని తన కార్యాలయంలో బాలుడి కుటుంబసభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌తో పాటు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డికి బాలుడి తల్లిదండ్రులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ మండల సమన్వయ కమిటీ ఏర్పాటు



ఎమ్మెల్యే రామిరెడ్డి సతీమణి ఆదిలక్ష్మితో సమన్వయ కమిటీ సభ్యులు

కావలి : మండలంలో వైఎస్సార్‌సీపీని బలోపేతానికి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పార్టీ ముఖ్యనాయకులతో మండల సమన్వయ కమిటీని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సతీమణి రామిరెడ్డి ఆదిలక్ష్మిని కలువగా ఆమె అభినందనలు తెలిపారు.

ఈ-శ్రమ్ కార్డుల పంపిణీ



అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హరిబాబు

అల్లూరు: కావలి డివిజన్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ హరిబాబు ఆధ్వర్యంలో చవటపాళెంలోని ఇంటింటికి ఈ-శ్రమ్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ 18 నుంచి 59 ఏళ్లలోపు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు సామాజిక ఉచిత సభ్యత్వ నమోదు పథకంలో చేరితే కేంద్ర ప్రభుత్వ పథకాల్లో పాధాన్యం కలిపించడం జరుగుతుందన్నారు. కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా అర్హులందరికీ ఈశ్రమ్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ రమేష్ నాయుడు, పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్, కామన్ సర్వీస్ సెంటర్ నిర్వాహకుడు గోళ్ల సతీష్, వీఓఏ సుమలత పాల్గొన్నారు.

చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలి



చిన్నారుల హాజరును పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ షాని

ఉదయగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ చిన్నారుల హాజరు శాతాన్ని పెంచాలని ఐసీడీఎస్ గండిపాళెం సెక్టార్ సూపర్‌వైజర్ షేక్ షాని అంగన్‌వాడీలకు సూచించారు. మండలంలోని సున్నంవారి చింతల, తిరుమలాపురం గిరిజనకాలనీ అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి కార్యకర్తలకు సూచనలు చేశారు. మెనూ తప్పక పాటించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సాలమ్మ, ధన, విజయ, చెంచురత్నమ్మ పాల్గొన్నారు.